ప్రయోజకత్వం

గోపాలం పెళ్ళానికికూడా లోకువయిపోయాడు. లోకులకు మరీ లోకువయిపోయాడు. తను బి. ఏ. పాసయి, పన్నెండేళ్ళయి ఉద్యోగం చేస్తున్నాడు. కాని గొర్రెతోకలా ఆ ఉద్యోగానికి ఎదుగూ బొదుగూ లేదు. అంటే తనకి లేదన్న మాట. ఎనిమిదేళ్ళ కూతురు బడికి వెళుతూన్న పిల్లకదా! ఇంటోపడివుంటే పెళ్ళానికి చీర కొనలేకపోయినా, పిల్లకి రెండు పరికిణీలయినా మంచివి కొనాలా మరి. అయితే ఈ రోజుల్లో బట్టలు కొనడమంటే మాటలా? ధరలు మండిపోతున్నాయి.

"మొన్న కుట్టించిన చుక్కల పరికిణీ వుండాలిగా. అ దేమయింది?" అన్నాడు గోపాలం చిరాగ్గా.

"మొన్నేమిటి మొన్న, ఆర్నెల్లయింది. ఇంకా కూచుంటుందా?" అన్నాది భార్య సావిత్రి. ఆ రోజు సావిత్రి మనసు చాలా చిరాకుగావుంది. పొద్దుటే పాలమనిషి పాత బాకీ తెమ్మని దెబ్బలాడి వెళ్ళింది. ఉట్టిమీద పెరుగు పిల్లి తిరగదోసింది. పెద్ద పిల్లడికి జ్వరం తగిలింది. చేతివాడు—వెధవకి రెండేళ్ళైనా లేవు. కాని మహా పెంకి. మరుగుతూన్న కాఫీనీళ్ళు కాళ్ళమీద పోసుకుని కాల్చుకున్నాడు. పెద్దపిల్ల కొత్తపరికిణీ కావాలని ఏడిచి నానా అల్లరీపెట్టి బడికి వెళ్ళడం మానేసింది.

"ఆర్నెల్లకే చిరిగిపోయిందా పరికిణీ?" అన్నాడు గోపాలం ఏం మాట్లాడాలో తెలీక.

"పరికిణీ అన్నది మరి చిరగదేమిటి ? అదేం రాయా రప్పా ?"

అవును మరి. రాధ బడిలో పలకమీద వుమ్మితడిచేసి, చేత్తో రాసి పరికిణీతో తుడుస్తుంది. మట్టిలో చేతులుపెట్టి పరికిణీకి తుడుస్తుంది. దీన్నంతటినీ భరిస్తూ ఎంతకాలముంటుంది పరికిణీ అన్నది. అదేం రాయా రప్పా? గోపాలానికి కూతురు మీద కోపమొచ్చింది.

"వెధవముండ, బడి ఎగ్గొట్టడానికి ఏదో సాకు చూసు కుంటుంది. ఆ చిరిగిన పరికిణీ వేసుకు వెళ్ళు ఇవాళకి. ఫరవా లేదు" అంటూ కూతురిమీద కళ్ళెర్రజేశాడు. రాధ మళ్లీ ఏడుపు లంకించుకుంది.

"చిన్నముండ, దానిమీదెందుకా కోపం. బడిలో నలుగురూ నవ్వుతారని దాని ఏడుపు" అంది సావిత్రి.

గోపాలానికేమీ తోచలేదు. పిల్లల్ని కోప్పడితే ఇలా అంటుంది, ముద్దులాడితే, ఇలా ముద్దుచేసే వాళ్లని పాడుచేస్తున్నారంటుంది. ఏమిటిదారి? ఏమిటి మాట్లాడాలో తెలీక "సరేలే, సాయింత్రం బజారుకువెళ్లి కుట్టించుకుందాం. "ఏడవకు మరి" అన్నాడు రాధ చెయ్యిపట్టుకుని. "మహా కుట్టించారులెండి! మీ చొక్కా కోటూ సంగతేదో మీరు చూసుకుందురూ చాలు! దాని సంగతీ, నా సంగతీ నే చూసు కుంటాను. లే, అమ్మా లే, ఏడవకు, రేవు మామయ్యకు కబురుపెట్టి నాలుగు పరికిణీలు కుట్టిస్తాలే" అంటూ కూతుర్ని చేరదీసింది సావిత్రి.

"నా చొక్కా కోటూ విషయంతప్ప తక్కిన సంసార మంతా నీ తమ్ముడే భరిస్తున్నట్టు మాట్లాడతావేమిటి?"

"భరించినా వాడు భరించగలడు. వాడికేం మహా రాజు, నాలుగొందలు జీతం" అంది సావిత్రి.

వాళ్ల తమ్ముడికి కలకత్తాలో ఏదో కంపెనీలో వుద్యోగం. రెండువంద లిస్తారు. సావిత్రి తన దగ్గరకూడా నాలుగు వందలని కోతలు కోస్తుంది. ఏదో, భోజరాజు మొహంచూస్తే కవిత్వం పుట్టేదిట, తన మొహం చూస్తే కోతలు పుడతాయి కాబోలు! రామ! రామ! ఏ మన్యాయం! అనుకున్నాడు గోపాలం.

"నేను రేపు మా అక్కయ్యగారింటికి వెళ్ళి ఒక నెల రోజులుండి వస్తాను" అంటూ కూతురి రెక్కపట్టుకుని వంటింట్లోకి వెళ్ళింది సావిత్రి. గోపాలానికి ఏమిటి మాట్లాడాలో తెలీక రెండు నిముషాలు ఆలోచించేడు. ఏం మాట్లాడితే ఏం ప్రమాదమోనని భయం.

సావిత్రి వంటింట్లోంచి తనకి వినబడేలాగ, "నిజంగా వాళ్ల సంసారంచూస్తే ముచ్చటేస్తుంది. మా బావ హాయిగా నెలకు నాలుగైదువందలు తెచ్చి యింట్లోపోస్తాడు. మనకంటె ఎవరేనా నయమే యీ లోకంలో" అంది.

గోపాలానికి భార్యమీద కోపమొచ్చింది. "అయితే నువ్వుకూడా మీ బావదగ్గరకే వెళ్లి వుండలేకపోయావ్" అందా మనుకున్నాడు. కాని అంతమాట అనలేదు. సావిత్రి ప్రతిరోజూ ఏదో విధంగా తన అసమర్థతను జ్ఞాపకం చేస్తూ వుంటుంది.

సావిత్రిపుట్టింటివారు ఒకప్పుడు భాగ్యవంతులు. ఆవిడ తండ్రి ప్లీడరీచేసి బాగా డబ్బు ఆర్జించి మరీ చచ్చిపోయాడు. కాని ఆ ఆస్తి చాలవరకు పోయింది. అయినప్పటికీ తన తండ్రి ప్లీడరీ చేశాడనీ, తన అన్నదమ్ములు, బంధువులు మంచి వుద్యోగాలు చేస్తున్నారనీ ఆవిడ గర్వం. తన భర్త తన కుటుంబహోదాకు తగినవాడు కాడని ఆవిడ అభిప్రాయం కాబోలు.

పెళ్లయిన మొదటిరోజుల్లో భర్తంటే సావిత్రికి మంచి గౌరవముండేది. చదువుకున్నవాడనీ; పెద్ద ఉద్యోగం చెయ్యగలడనీకలలుకంది. కాని రానురాను అతనిలో నమ్మకం పోయింది. అతను బి. ఏ. పాసయాడన్న విషయం మరచిపోయింది. "అవును మరి, డబ్బు సంపాదించలేని తరువాత ఎందుకొచ్చిన చదువు, దిక్కుమాలిన చదువు" అన్నాడు గోపాలం. తను వొట్టి అప్రయోజకుడు. తన ప్రయోజకత్వమంతా పిల్లల్ని కనడం తప్ప యింకేముంది? గోపాలానికి తనమీద తనకే జాలేసింది.

గోపాలం వీధిలో అరుగుమీద కూర్చుని తీవ్రంగా ఆలోచించాడు. తన స్థితి కళ్ళకు కట్టినట్టుంది. లోకంలో డబ్బు ఆర్జించలేనివాడు వొట్టి అప్రయోజకుడు; చెల్లనిరూపాయి. అయితే తనకీ సంగతి తెలియకకాదు. తను బి. ఏ. పాసయిన తరువాత పెద్దవుద్యోగం చెయ్యాలనీ, దర్జాగా హాయిగా బతకాలనీ ఎన్నోకలలుకన్నాడు. అయితే ఆ పెద్ద వుద్యోగం సంపాదించడ మెలాగో తెలియలేదు. తనకంటె తక్కువ చదువుకున్నవాళ్లు పెద్ద వుద్యోగాలు, ప్రమోషన్లు,

ఎలా సంపాదిస్తున్నారు? డబ్బు ఎలా గడిస్తున్నారు? వాళ్లకి సిఫారుసు లుండివుంటాయి; లంచాలు కట్టివుంటారు; అధికారుల యిళ్లకు వెళ్ళి సేవచేస్తారు; హాయిగా లంచాలు పుచ్చుకుంటారు. తనెందుకు చెయ్యగూడదు ? ఛీ! ఇవన్నీ వెధవపనులు! అయితే ఏం ? వాళ్ళీ వెధవపనులుచేసి బాగుపడ్డారు. తను మడిగట్టుకు కూర్చుని ఏమిటి సాధించేడు? పెళ్లాంచేత చీవాట్లు తప్ప !

తనతోబాటు చదువుకున్న విశ్వనాథం తాశీల్దారైనాడు. రంగనాథం వ్యాపారంచేసి కారు కొన్నాడు. తనతోడల్లుడు రామారావు గుమాస్తాపని చేస్తూ అప్పుడే యిల్లు కట్టించేడు. భూములు కొన్నాడు. పబ్లిక్‌గా లంచాలు పుచ్చుకుంటాడు. కాని ఆశ్చర్యం! వాడికి ఊళ్ళో ఎంత గౌరవం! వీళ్ళంతా డబ్బు ఎలా సంపాదిస్తున్నారు? ఈ చిదంబరరహస్యమేమిటో తనుకూడా తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు గోపాలం.

డబ్బు సంపాదించడానికి గల మార్గాలేమిటని ఆలోచించేడు. ముందు అధికారిమంచి సంపాదించాలి. వారింటికెళ్ళి సేవచెయ్యాలి. లంచమివ్వాలి. లంచమివ్వడానికి తన దగ్గర డబ్బులేదు. అసలు రూలుప్రకారం తను యితరులదగ్గర డబ్బు లంచాలు పుచ్చుకొని అందులో కొంతభాగం మీాద వాళ్ళకివ్వాలి. తను ప్రస్తుతం పనిచేస్తున్న సీట్‌లో లంచాలు తీసుకోడానికి చాలా అవకాశాలున్నాయి. పన్నెండేళ్ళు అనుభవమున్న గ్రాడ్యుయేటేకదా అని దొరగారు తనకి మంచి సీటే యిచ్చేరు. ఇన్నాళ్ళూ ఇటువంటి అవకాశాన్ని సద్విని

యోగం చేసుకోలేకపోయినందుకు విచారించేడు గోపాలం. కాబట్టి ఒకవేపు అధికారిని మంచిచేసుకుంటూ, యింకోవేపు లంచాలు పుచ్చుకుంటూ, అందులో కొంతభాగం అధికారి కిస్తూ ప్రమోషన్ సంపాదించి, అప్పుడు యింకా ఎక్కువ లంచాలు సంపాదించి అలా మెల్లిగా అంతా నిర్మించుకురావాలి! భేష్! ప్లాను మహా చక్కగా కుదిరింది అనుకున్నాడు గోపాలం. గౌతమబుద్ధుడికి జ్ఞానోదయం కలిగినట్లు గోపాలానికి యీ మహాపథకం స్ఫురించింది. ఉత్సాహంతో కుర్చీదిగి అరుగుమీంచి రోడ్డుమీదకి ఒక దూకు దూకి వీధిలోంచి నడిచివెళ్లేడు.

ఇప్పుడు కోర్టుకు సెలవలు కాబట్టి మునసబుగారు ఇంటిదగ్గరే వుంటారు. మునసబుగారు చాల మంచివారు. ఇన్నాళ్ళు ఆయనతో వ్యక్తిగతంగా సంబంధం పెట్టుకోకపోవడం పెద్ద పొరపాటు. మంచికేనా చెడ్డకేనా ఆయన దన్నుండాలి. అయితే యిన్నాళ్లకి మొదటిసారిగా వారింటికి వెళుతున్నప్పుడు వొట్టి చేతులతో వెళ్లకూడదు. ఒక డజను మామిడిపళ్లు కొని పట్టుకెళితే బావుంటుంది. బహుశా తను వెళ్లేసరికి ఆయన స్నానంచేస్తూనో, భోజనంచేస్తూనో వుంటారు. అప్పుడీ పళ్లు మునసబుగారి కుమార్తె రవణమ్మ చేతికే ఇచ్చివచ్చును. రవణమ్మ చాల అందమైంది. ఇంటరు చదువుతోంది. ముందు ముందు తను రవణమ్మతో చనువుగా మాట్లాడాలి. వాళ్ళింట్లోవాడిలాగే చనువుగా తిరగాలి.. వాళ్ళకి చిన్నచిన్న పనులు చేసిపెట్టాలి. ఇవన్నీ తను కట్టబోయే సౌధానికి సోపానాలు. కొంపతీసి చనువుకొద్దీ రవణమ్మ తన్ను ప్రేమిస్తే!

వివాహం చేసుకోమంటే! ఒక భార్య వుండగా మళ్ళీ ఎలా చేసుకోగలడు? తన భార్య చనిపోతే బాగుండు ననిపించింది గోపాలానికి. ఛీ! భార్యచావు కోరడ మేమిటి? అందులోకీ సావిత్రిని సుఖపెట్టడానికే కదా యీ అవస్థ అంతాను. ఇంతకీ రవణమ్మ కర్మం కాలి తన్నెందుకు వరిస్తుంది? అసలా సమస్య రానేరాదు. ఇంతకీ ఏది ఎలా జరుగుతుందో ఎవరు చెప్పగలరు? ఈ ఆలోచనలతో గోపాలంబుర్ర కాకెక్కిపోయింది.

ప్రక్కనే వున్న మంగలిషాపులోకి వెళ్ళి గెడ్డాం గీయించుకుని, మొహం కడుక్కుని తల దువ్వుకుని అద్దంలోచూసుకున్నాడు గోపాలం. తలమీద ఒకటి రెండు వెంట్రుకలు నెరిసేయి. కాని యవ్వనం సడలిపోలేదు.

పళ్ళదుకాణందగ్గర ఒకడజను మామిడిపళ్ళు కొని సరాసరి మునసబుగారింటికి వెళ్ళేడు గోపాలం. వీధిగుమ్మంలో నిలుచున్నాడు. లోపలినుండి రవణమ్మ వచ్చి "ఎవరు?"అంది.

"మునసబుగారు లేరాఅండి?"

"పూజలో వున్నారు. అలా కూర్చోండి" అని వెళ్ళిపోయింది. రవణమ్మకు యీ పళ్లు ఎలా యివ్వడమో గోపాలానికి బోధపడలేదు. మళ్ళీ పిలిస్తే బాగుండదు! అసలేమని పిలవాలి?

ఇంతలో లోపలినుండి బంట్రోతు వీరయ్య వచ్చాడు. గోపాలానికి చక్కటి ఆలోచన తట్టింది. "చూడు వీరయ్యా, యీ మామిడిపళ్లు తీసికెళ్ళి ఇంట్లో అమ్మగారి కిచ్చేసిరా" అని సంచీ అందించేడు వీరయ్యకి. తన చిక్కుసమస్య ఒక్క తృటిలో పరిష్కారమైంది.

మరో అయిదు నిముషాలకి రమణమ్మ వీధిలోకివచ్చింది. రమణమ్మ నిజంగా చాల అందమైంది. రొమ్ములమీద బరువుగా, నల్లగా, తాచుపాములా జారుతున్న జడకు రిబ్బను ముడి వేసుకుంటోంది. తల వొంచుకున్నప్పుడు తెల్లటి మెడమీద నీలిరక్తనాళాలు అందంగా కనిపిస్తున్నాయి. గోపాలం గాభరాగా లేచి నిలుచున్నాడు. మామిడిపళ్ళు యీమె చేతికందించే భాగ్యం తనకు దక్కనందుకు విచారించేడు.

అతని గాభరా రమణమ్మ కనిపెట్టింది. "కూచోండి. నాన్నగారి పూజ అయింది. వస్తారు. గోపాలంగారంటే మీరేనా?" అంది నవ్వుతూ.

"అవునండి"

"మామిడిపళ్ళు చాల బాగున్నాయి. ఎక్కడివి? కొన్నారా?"

ఏమని జవాబివ్వాలో గోపాలానికి తోచలేదు. ఇటువంటి ప్రశ్న వస్తుందనిగాని, వస్తే ఎలా జవాబివ్వాలనిగాని ఇంతకు మునుపు ఆలోచించుకొని రాలేదు. కొన్నానని చెప్తే లంచమిస్తున్నా డనుకుంటుంది. లేకపోతే ఎలా వచ్చాయంటుంది. ఏమిటి దారి? హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది.

"అబ్బే లేదండీ, మా తోటలో కాసినవి. ఈ రకం సువర్ణరేఖలు అసలు బజారులో కనబడవండీ!" అన్నాడు. తన సమయస్ఫూర్తికి సంతోషించేడు.

అంతట్లో మునసబుగారు లోపలినుండి వచ్చారు. గోపాలం లేచి నిలబడి వినయంగా నమస్కారం చేశాడు. మున

సబుగారు చొక్కా తొడుక్కుంటూ, "ఏమిటోయ్—గోపాలం! ఏమిటి విశేషం ?" అని ప్రశ్నించేరు.

"అబ్బే. ఏమీ లేదండీ, ఓసారి తమ దర్శనంచేసుకు వెళదామని వచ్చాను" అన్నాడు గోపాలం.

"నాన్నా, గోపాలంగారు వాళ్ల తోటలో కాసిన మామిడిపళ్ళు తెచ్చి ఇచ్చేరు. చాల బావున్నాయి" అంది రవణమ్మ.

"అలాగటోయ్, చెప్పేవుకావు. ఏమాత్రం తోటుంది! పెద్దదేనా ?"

"అబ్బే లేదండీ, ఏదో మా నాన్నగారు వేయించారు" అన్నాడు తడబడుతూ గోపాలం. తోట పరిమాణం ఎలా చెప్పాలో తెలియలేదు.

"ఏదో బాగానే వుంది. తోటా దొడ్డీ యీ రోజుల్లో సంపాదించడమంటే బహుకష్టం" అన్నారు మునసబుగారు.

గోపాలం వుక్కిరిబిక్కిరైనాడు. అసలు వ్యవహారం ఇలా తిరుగుతుందని అనుకోలేదు. మునసబుగారితో తను డబ్బున్నవాడని చెప్పుకోవాలో, ఎలా చెప్పుకుంటే తన భావి కార్యక్రమానికి మంచిదో ముందుగా ఆలోచించుకుని రాలేదు. ఏదైనప్పటికీ ఆయనముందు తనీవిధంగా అబద్ధమాడడం తన కిష్టంలేదు. అసలు వ్యవహారమంతా గందరగోళమైంది. ఛీ! దీనంతటికీ రవణమ్మే కారణం. తనపాలిట బాగా దాపరించింది శనిలాగ! అనుకుని మునసబుగారి దగ్గర సెలవుతీసుకొని వెళ్లిపోయాడు గోపాలం.

మర్నాటినుంచీ గోపాలం లంచాలు పుచ్చుకోవడం ప్రారంభించేడు. మొదట్లో కష్టంగావున్నా తరవాత క్రమముగా అలవాటైంది. మనుషుల తరహాలనుబట్టీ, కేసులనుబట్టీ ఎలా మాట్లాడాలో, లౌక్యం, నటన, కపటం, మోసం అన్నీ చక్కగా అలవర్చుకున్నాడు. కాని ఇవన్నీ అతనికి సమంగా వొంటబట్టలేదు. లౌక్యం లౌక్యంగానూ, నటన నటనగానూ బయటపడేవి.

ఇప్పుడు గోపాలానికి స్నేహితులు ఎక్కువయారు. వారందరూ గోపాలాన్ని స్తుతించడం ప్రారంభించేరు. ఊళ్లో ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా అతనికి ఆహ్వాన మొచ్చేది. గోపాలగ ఘనత బంధుకోటిలోకూడా వ్యాపించింది. బావమరుదులు, తోడల్లుళ్ళూ తరుచు వస్తూ పోతున్నారు.

ఊళ్లో ఎప్పుడేనా గోపాలంవిషయమొస్తే "గోపాలం దేనికైనా సమర్థుడు. అంచేతే భగవంతుడు అతనికి ఐశ్వర్యం, ధర్మచింత, ఉత్తమగుణాలు అన్నీ ప్రసాదించేడు" అనేవారు పెద్దలు. సంఘంలో తన హోదా, తన ప్రయోజకత్వం ఎంతలో పెరిగిందో సులువుగా గ్రహించేడు గోపాలం. కాని అతని కిదేం నచ్చలేదు. ఇప్పుడు బంధువులు, స్నేహితులూ మాటాడేమాటల్లో పెద్దమార్పు కనిపించింది. "ఫలానా భూమి చవగ్గా అమ్మేస్తున్నారు కొంటారా" అని ప్రశ్నిస్తాడు ఒకడు. "ఈ అద్దెఇంట్లో ఎన్నాళ్ళిపాట్లు, ఒక చిన్నకొంప నిలేసుకుంటే మంచిద"ని యింకొకరు సలహాయిస్తారు. "మా సంఘానికి విరాళ మివ్వండి" అని యింకొకరు అర్థిస్తారు. "మీ కేమండీ, అదృష్టవంతులు, బి. ఏ. పాసయేరు. చదువు

కున్న చదువు ఏొట్టిసే పోతుందా? అంచేతే యీనాడు నాలు గురాళ్లు సంపాదిస్తున్నారు'' అని ఒకరిద్దరు తనముందే అన్నారు. అప్పుడు గోపాలానికి చాల చిరాకేసేది. "బోలెడు డబ్బుపోసి, శ్రమపడి బి. ఏ. చదవడం చాల పొరపాటు చేశాను. నా బి. ఏ. వల్ల నాలుగురాళ్లు సంపాదించడం లేదు. నా సంపాదనవల్ల నాకూ, నా బి. ఏ. కీ గౌరవ మొచ్చింది'' అని జవాబు చెబుదామనుకున్నాడు. లంచాలు పుచ్చుకునేవాడికి విలువలు ఆపాదించే యీ అనాగరికులను చూసి గోపాలం అసహ్యించుకునేవాడు. కాని ఏమీా మా ట్లాడకుండా వచ్చేసేవాడు.

ఇప్పుడు సావిత్రిలోకూడా గొప్పమార్పు గమనించేడు. సావిత్రిలో యిప్పుడు చిరాకు, కోపం మాయమయినాయి. పిల్లల్ని కొట్టదు. తను రోజూ చక్కగా అలంకరించుకుని, పిల్లలని బాగా సంరక్షణచేస్తుంది. తనతో నెమ్మదిగా భయ భక్తులతో, ప్రేమతో మాట్లాడుతుంది. ప్రతి విషయం లోనూ తన సలహా తీసుకుంటుంది. తన అనుమతిలేనిదే ఏ పనీ చెయ్యదు. ఇంతకుముందులా అక్కయ్య దగ్గరికి, అన్నగారి దగ్గరికీ వెళిపోతానని బెదరించదు, తన అనుమతి కోరుతుంది. తను మాటాడితే ఎదురుచెప్పదు. తనపట్ల ఆమెకున్న అనురాగం విషయంలో తన కెప్పుడూ, ఎటువంటి సంశయమూ లేదు, కాని ఆమెకూడా అందరి భార్య ల్లాంటిదే. పాపం, అమాయకురాలు అనుకున్నాడు గోపాలం.

సావిత్రి తన్ను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తూంది. ఆమె మళ్ళీ తన వీణ బయటికి తీసింది. సావిత్రికి సంగీతం బాగా

వచ్చును. వీణ వాయించగలదు. పాడగలదు. శ్రావ్యమైన కంఠం. పెళ్ళయిన తొలిరోజుల్లో భార్యపాట విని పరవశం చెందేవాడు తను. ఆనాడు సావిత్రిపాట అవ్యక్త మధుర భావాల్లా, పూచిన సంపెంగపువ్వు వాసనలా తరంగాలుగా వచ్చి తన హృదయాన్ని తాకేది. ఆ రోజులు స్వప్నంలా గడిచేయి. ఆనాటి కీనాడు మళ్లీ పాట వింటున్నాడు.

కాని యీ పాట విన్నప్పుడు గోపాలానికి ఆనాటి అనుభూతి కలగడంలేదు. మీదుమిక్కిలి అతని మనసు ఎంతో బాధపడేది. ఇదంతా చాలా కృత్రిమంగా కనిపించేది.

ఒకనాడు సాయంత్రం కచేరీనుంచి వచ్చేసరికి సావిత్రి తల దువ్వుకుని, సిగలో గులాబీలు ముడుచుకుని అతని రాకకు ఎదురుచూస్తూంది. గోపాలం కాఫీ తాగి గదిలో కుర్చీమీద కూర్చుని దినపత్రిక చూస్తున్నాడు. సావిత్రి తమలపాకులకు సున్నంరాసి అందించింది.

"ఏమండి, మా అమ్మ ఉత్తరం వ్రాసింది" అంది మెల్లిగా.

"ఊఁ హూ..."

"వచ్చేవారం మా చెల్లెలి పెళ్ళట"

"మంచిదే"

మనల్ని పిలవడానికి మా తమ్ముడు వస్తాడట. మీరొక వారం పదిరోజులు సెలవు పెడితే..."

"అబ్బే, లాభంలేదు. ఇప్పుడు కచేరీలో పనెక్కువగా వుంది. సెలవ దొరకదు, నువ్వెళ్ళు; నేను రాను"

"బావుండండీ, మీరు రాకుండా నేను వెళ్లనుసుమండీ"

గోపాలానికి చిరాకేసింది. ఇంతకుముందు తనో కర్తే వాళ్లవాళ్ళింటికి ఎన్నిసార్లు వెళ్ళలేదు? ఇప్పుడు ప్రయోజకుడైన భర్తతో వెళ్ళి నలుగురిచేత మర్యాదలు పొందుదామని ఆశపడుతూంది అనుకున్నాడు గోపాలం.

ఆవేళ అసలు గోపాలంమనసు బాగులేదు. ఒకప్పుడు తనొక బీదస్త్రీదగ్గర లంచం తీసుకున్నాడు. అప్పటికే ఆమె ఇద్దరుపిల్లలతల్లి. భర్త చనిపోయాడు. ఆమెకు తా నెట్టి సహాయం చెయ్యలేనని తెలిసికూడా లంచం తీసుకున్నాడు. ఆమెమీద దావావేసిన మార్వాడీవాడు కేసుగెలుచుకుని ఆమెసామానులు జప్తుచేసుకున్నాడు. ఆ స్త్రీ ఇవాళ తనకి రోడ్డుమీద బిచ్చమెత్తుకుంటూ కనబడింది. తన మనసు ఎందుకో చాల బాధపడింది. తను చేస్తున్నపని చాల హేయమయింది, తన్ను క్షమించమని ఆమెను తన మనసులోనే కోరేడు. ఇవాళతో ఏమైనాసరే ఒక దమ్మిడీ లంచం తీసుకోకూడదని నిశ్చయించుకున్నాడు. ఈ కృత్రిమసౌఖ్యమే తన కెంతో బాధ కలిగిస్తూంది.

"మీరు రాకపోతే నేను వెళ్లను" అంది సావిత్రి.

"అయితే ఏడువు. నేనుమాత్రం చస్తే రాను" గోపాలానికి చాల కోపమొచ్చింది. "నా వుద్యోగంపోతే మీ వాళ్ళు నా కేమేనా వుద్యోగమిస్తారా? వాళ్ల కసలు కనికారమేనా కలగదు. పీడాట్టి చవటవెధవని వెక్కిరించి సంతోషపడతారు" అన్నాడు చిరాకుగా. సావిత్రి మాటాడలేదు.

గోపాలానికి వెంటనే విచారమేసింది. తను అర్థంలేకుండా కోపం తెచ్చుకున్నాడు.

సావిత్రి మాటాడకుండా, బుర్ర వొంచుకుని, చీర కొంగుతో కళ్లనీళ్ళు తుడుచుకుంది. ప్రయోజకుడైన భర్త ముందు భార్య అంతకన్న చెయ్యగలిగినదేముంది? ఏం, తన కోపం అర్థంలేనిదని చెప్పకూడదూ? అసలు పెళ్లామనేది మొగుడి కింతలా లోకువయిపోవడం గోపాలానికి నచ్చలేదు.

కాని సావిత్రికి కళ్లనీళ్లు చూసేసరికి అతనిమనసు కరిగింది. "ఎంత అమాయకురాలివే. ప్రతి చిన్న విషయానికీ యిలా అయితే ఎలా చెప్పు? నాకు సెలవు దొరకదు. నువ్వు మీ తమ్ముడితో వెళ్ళు. సెలవు దొరికితే నేనూ వస్తాను" అని మెల్లిగా నచ్చచెప్పేడు.

సావిత్రికి ధైర్యమొచ్చింది. పెళ్ళిలో చదివించడానికి చీర, పంచలచాపు కొనాలంది.

"సరే, నువ్వు బజారుకెళ్లి కొనుక్కురా, నాకు తీరిక లేదు" అన్నాడు గోపాలం.

"మీరొచ్చి మంచివి ఎంచండి"

"నాకు చీరలగొడవ ఏమీ తెలీదు"

"బావుందండీ, తెలియకపోవడమేమిటి?" అంది సావిత్రి.

గోపాలానికి ఆశ్చర్యమేసింది. ఈ లోకంలో డబ్బు సంపాదించగలిగినవాడు సర్వజ్ఞుడని, వాడికి తెలియని విషయమంటూ వుండదని కాబోలు ఆమెవుద్దేశం. అయినా, ఆమె వెళ్ళి కొనుక్కోకూడదూ? భార్య భర్తమీద యింతగా ఆధారపడడంలో అర్థం లేదనిపించింది గోపాలానికి.

చీరవిషయమై గోపాలం పాతికరూపాయలు మంజూరు చేశాడు. సావిత్రి అతి అయిష్టంగా ఒప్పుకుంది. ప్రస్తుతానికి ఆమె, పిల్లలు వెళ్ళడానికి నిర్ణయమైంది. కాని ఎలాగైనా సెలవుకోసం ప్రయత్నించమని సావిత్రి మరీ మరీ చెప్పింది.

గోపాలం ఆలోచనలోపడ్డాడు. లంచగొండితనం తనకు ప్రసాదించిన హోదా, ప్రయోజకత్వాలను చూస్తే తనకే అసహ్యమేస్తూంది. జ్ఞానం, మానవత్వం అనేవి డబ్బుకంటె విలువైనవనీ, అవే జీవితానికి ఆనందాన్నీ, పూర్ణత్వాన్నీ చేకూర్చగలవనీ తన మనసు హెచ్చరిస్తూంది. సంఘం కొలిచే కొలబద్దలతో తన ప్రయోజకత్వాన్ని కొలవడం తన విద్యకీ, విజ్ఞానానికీ ఎంతో అవమానకరంగా స్ఫురించింది. తనకీ గౌరవం అక్కరలేదు. తనలో వచ్చిన బ్రహ్మాండమైన మార్పును గమనించి ఆశ్చర్యపోయాడు గోపాలం. ఇకమీదట ఒక దమ్మిడీకూడా లంచం పుచ్చుకోకూడదని నిశ్చయించుకున్నాడు.

రెండురోజులు గడిచేయి. ఈ రెండురోజుల్లోనూ గోపాలము ఒక కానీ లంచం పుచ్చుకోలేదు. ఈ సంగతి అప్పుడే కచేరీ అంతా వ్యాపించింది. అందరూ తలోకరీతి వ్యాఖ్యానించేరు. మూడోనాడు గోపాలం ఆఫీసుకు వెళ్ళేక, మునసబుగారు పిలిస్తే ఆయనగదిలోకి వెళ్ళేడు.

మునసబుగారు ఏదో వ్రాసుకుంటూ తలెత్తి కూర్చోమన్నట్లు సంజ్ఞ చేశారు. కాని గోపాలం కూర్చోలేదు.

"రామకోటయ్యకు చార్జి అప్పగించు. నీమీద పైనుండి పెద్దచార్జిషీటు వచ్చింది. కచేరీ కాగితాల్లో నువ్వు చెయ్యి

రాని తప్పులు చేశావు. కొన్ని కాగితాలమీద తేదీలుకూడా మార్చబడివున్నాయి. నీమీద ఎంక్వాయిరీ జరిగి కేసు ఏదో తేలేవరకూ నిన్ను ప్రస్తుతం సస్పెండు చెయ్యవలసివచ్చింది." అన్నారు మునసబుగారు గుక్కతిప్పుకోకుండా.

గోపాలం నిలువునా క్రుంగిపోయాడు. ఏం చెయ్యాలో తెలియక అలాగే నిలుచున్నాడు. మునసబుగారు మళ్ళీ తలెత్తి, "నీ సంగతి నాకు బాగా అర్థమయింది. సరే, ముందు ఆ చార్జిషీటుకు సంజాయిషీ వ్రాసి దాఖలు చెయ్యి, తరవాత ఆలోచిద్దాం" అన్నారు. మునసబుగారు నిజంగా సహృదయులు.

గోపాలం మాట్లాడకుండావచ్చి రామకోటయ్యకు చార్జి అప్పగించేడు. పాపం పిల్లలుగలవాడు అని తక్కిన గుమాస్తాలు సానుభూతి చూపించేరు. హెడ్ గుమాస్తామాత్రం వెకిలినవ్వు నవ్వేడు. "లంచాలు పుచ్చుకోగానే సరా? అబ్బో, దాని కెంత సమర్థత కావాలి !" అన్నాడు అనుభవజ్ఞుడైన హెడ్ గుమాస్తా. లంచాలు పుచ్చుకోవడంవల్ల ఉద్యోగం పోవడంలో వున్న చిన్నతనంకంటె, లంచాలు పుచ్చుకోవడంలో అసమర్థుడుకావడం ఎక్కువ చిన్నతనముందని కాబోలు అతని అభిప్రాయం. గోపాలానికి హెడ్ గుమాస్తానుచూస్తే వొళ్లు మండింది. కాని మాటాడకుండా చార్జిషీటు పుచ్చుకుని ఇంటికి వచ్చేశాడు.

సరాసరి గదిలోకివెళ్లి మంచంమీద పడుకున్నాడు. సావిత్రి తన చెల్లెలు పెళ్ళికి వెళ్ళడానికి సన్నాహమైవచ్చింది

"ఏమండీ సెలవు దొరకలేదా ?" అన్నది మెల్లిగా. గోపాలం మంచంమీద లేచి కూర్చున్నాడు. "సావిత్రీ, ఇవాళ నా వుద్యోగం పోయింది. మళ్ళీ ఏదేనా దొరికేవరకూ అంతా సెలవే, పద నేనుకూడా వస్తాను మీవాళ్ళింటికి" అన్నాడు.

సావిత్రి మొదట్లో నమ్మలేకపోయింది. కాని గోపాలం మళ్లీ చెప్పేడు. ఆమెకు నోటమాట రాలేదు. ఎవరో తలమీద కర్రతో కొట్టినట్లనిపించింది. డబ్బులేక బాధపడిన కష్టదినాలు మళ్ళీ జ్ఞాపకమొచ్చేయి. భగవంతుడు తనకీ, తన పిల్లలకీ యీ శిక్ష ఎందుకు విధిస్తున్నాడో ఆమెకు అర్థం కాలేదు. తలగడలో మొహంపెట్టి చేతులతో కప్పుకుంది. "లే, విచారించకు వెధవ వుద్యోగం పోతె మరొకటి దొరకుతుంది. పద సామాను కట్టు, నేనూ వస్తాను వెళదాం" అన్నాడు గోపాలం.

"నేను వెళ్లను, నాకొద్దు"అని వెక్కి వెక్కి ఏడిచింది సావిత్రి. ఆమె ఎందుకు వెళ్లనంటూందో గోపాలానికి అర్థమయింది. సావిత్రిమీద అతనికి జాలికలిగింది.

—o—